
# పరివర్తన

బజ్జి



ఈ వేళ మా పక్కింటివాడి కూతురి పుట్టిన రోజు. ఉదయాన్నే పక్కింటివాడి కూతురు స్వీటు తీసుకొచ్చింది.

ఆ పిల్ల మెడలో రాళ్ళతో ధగధగ మెరుస్తున్న చిన్న నక్లెస్. స్వీటు తీసుకుంటూ "నక్లెస్ కొనుక్కున్నావా?" అడిగింది మా ఆవిడ.

"మా డాడీ తెచ్చారు. ఎనిమిది వేలు" అంది కళ్ళు తిప్పుతూ.

"నాకూ అలాంటి నక్లెస్ కొనవే అమ్మా" ఆశగా అడిగింది మా పాప.

"అదొక్కటే తక్కువ మన మొఖానికి" అంది మా ఆవిడ గసురుకుంటూ.

"డాడీని తెమ్మంటాను"

"అన్నీ తెచ్చే డాడీ అయితే నిన్ను పట్టుకోనేలేక పోదూ" అంది ఈసడింపుగా.

నా మనసు చివుక్కుమంది. అలా చివుక్కుమనడం ఇది ఎన్నోవందల సారి. నా మనసింతే. ఇంకా గడ్డకట్టుకుపోతోంది. ప్రతీకారంగా నేను చేసేది ఒక్కటే. తననింకా బాధలలోకి త్రోసేయడం. అంటే నన్ను నేను శిక్షించుకోవడం.

పక్కింటివారు ఎవడోకాదు. మా జ్ఞాతి. మా తాతా వాడి తాతా అన్నదమ్ములు. వాడి తాత అన్న, మా తాత తమ్ముడు. రామలక్ష్మణుల్లా పుట్టి పెరిగారు.

పెత్తనం అన్నదీ, చాకిరీ తమ్ముడిదీ. ముప్ఫయ్యేళ్ళు వచ్చినా అన్నమాటకు ఎదురు చెప్పకుండా అచ్చు లక్ష్మణస్వామిలానే వ్యవహరించాడు మా తాత.

తండ్రిచ్చిన నాలుగెకరాలు వ్యవసాయం నలభై ఎకరాల అయింది. ఆడవాళ్ళకి పడక అన్నదమ్ములు పంపకానికి సిద్ధమయ్యారు.

"నా పేరనున్న ముప్ఫయి ఎకరాలు నావి. నీపేరనున్న పది ఎకరాలు నీవి" అన్నాడు రాముడు.

"కుదర్దు, నాకూ ఇరవై రావాలి" అన్నాడు లక్ష్మణుడు.

"ముప్ఫయి ఎకరాలు నేను కొనుక్కున్నాను. నావి" అన్నాడు రాముడు మొండిగా.

లక్ష్మణుడు తిరగబడ్డాడు.

బాహాబాహీ, కర్రా కర్రా కత్తీ కత్తీ కలిసాయి. యుద్ధంలో లక్ష్మణుడు నేలకొరిగాడు.

పల్లెటూరి పెద్దలు కేసు మాఫీ చేసి లక్ష్మణుణ్ణి మట్టిచేశారు.

దానితో మా నాయనమ్మ అక్కడుంటే తననీ తన కొడుకునీ చంపేస్తారని భయంతో పుట్టింటికి పారిపోయింది. నానా కష్టాలుపడి కొడుకునెంతో గారాబంగా పెంచింది.

కాలంతోపాటు రాముడికీ కాలం తీరిపోయింది. రాముడి కొడుకు ధర్మజుడు. మా నాయన్ని పిలవనంపి ఆయన పొలం ఆయనకిచ్చాడు. అంటే మా తాతపేర వున్న పదెకరాలు.

మా నానమ్మ ఒప్పుకోవద్దంది.

"అది మాత్రం ఇవ్వకపోతే వాళ్ళని ఏం చేయగలం" అని పుచ్చుకున్నాడు మా నాన్న.



ధర్మజుడు న్యాయంలోనే గాక జూదంలో కూడా ధర్మజుడే. ధర్మజునికి లేని వ్యభిచార, సురాపానాలనే రెండు వ్యసనాలు అదనంగా గలవాడు. తండ్రి తనకిచ్చిన అరవై ఎకరాల మాగాణీ ఆరేళ్ళలో కరారావుడు చేసి ప్రక్కింటి వాళ్ల ప్రక్క పోర్షనులో వదిలి రంభతో స్వర్గసౌఖ్యాలనుభవించడానికి స్వర్గస్థుడైపోయాడు.

ప్రక్కింటివాడు గోచీ పెట్టినలగాయతు పొట్ట కోసం పడరానిపాట్లు పడి పాలేరుగా, కూలీగా, కూరగాయల వర్తకుడిగా, కిరాణా వ్యాపారిగా రకరకాల అవతారాలెత్తి చివరికి హోల్‌సేల్ వర్తకుడిగా స్థిరపడి లకారాలు సంపాదిస్తున్నాడు.

మానాన్న నేను పుట్టాక పదేళ్ళు పెంచి తనువు చాలించాడు. కొడుకు పోయాడన్న దిగులుతో మా నానమ్మ ఆ సంవత్సరమే వెళ్ళిపోయింది. భర్త, అత్త పోయిన బాధలో కూతురి పెళ్ళి చేయలేనేమోనన్న బెదురుతో కంగారుపడి రెండెకరాలమ్మి మా అక్క పెళ్ళి చేసింది మా అమ్మ. అల్లుడు మరో రెండు ఎకరాలు అమ్మించిగాని సంతృప్తిపడలేదు.

మిగిలిన ఆరెకరాల్లో నా పట్నం చదువుకోసం నాలుగెకరాలు అమ్మేసింది అమ్మ.

సినిమాలూ, స్నేహితులు సాంగత్యంలో అయిదేళ్ళలోనేను ఇంటర్ పాస్ కాలేకపోయాను. కట్నం వచ్చే సంబంధం కాదని అందగత్తె అని బీదింటి పిల్లని పెళ్ళి చేసుకున్నాను.

పెళ్ళయ్యాక ఉన్న రెండు ఎకరాలు అమ్మి పట్నం కాపురం పెట్టాను. ఆ డబ్బు అయిపోయేసరికి మా అమ్మ కూడా వెళ్ళిపోయింది.

అక్కడ నుంచి మొదలయింది కథ.

ఇంతకుముందు ఇంటి విషయాలు పట్టించుకోకుండా ఆనందం పొందడమే జీవిత ధ్యేయంగా బ్రతికాం నేనూ, మా ఆవిడ. ఒక్కసారి ఈలోకంలోకి వచ్చి ఇల్లు గడిచే మార్గం కనబడక కంగారుపడిపోయాం.

"బి.ఎ. చదివారు కదా ఉద్యోగం చూసుకోండి" అంది మా ఆవిడ.

నేను ఇంటర్ కూడా పాసు కాలేదంటే పరువు పోతుందని "అలాగే" అని మాట దాటేసాను. సందట్లో సడేమియాలా మా పాప కూడా కడుపున పడింది. ఉన్న నగానట్రా అమ్మి ఆ సంవత్సరం ఎలాగో కాలం గడిపాం.

పురుడు పోసుకుని మూడో నెలలో పుట్టింటి నుంచి వచ్చింది తను. ఆ రాత్రి మీద చెయ్యి వేస్తే గయ్యిమంది.

"ఏమిటంత ఎగిరిపోతున్నావు?" అన్నాను కోపంగా.

"ఏడాది గడిచినా ఉద్యోగం చూసుకోలేకపోయారు. ఎలా పెంచుతారు మమ్మల్ని?" అంది గట్టిగా.

"చూద్దాంలే" అన్నాను.

"చూద్దాంలే కాదు. పిల్లకి పాలడబ్బా నిన్నే అయిపోయింది. ఉదయాన్నే మీకు చెప్పాను. తేకపోతే ఎలా?"

"ట్రై చేసాను. దొరకలేదు".

"ఎన్నాళ్ళిలా అప్పులు చేస్తూ గడుపుతారు? ఎన్నాళ్ళు ఇచ్చేవాళ్ళు ఇస్తారు?"

"జరిగినంత కాలం" అన్నాను నవ్వి.

"ఆ తర్వాత?"

సమాధానం దొరక్క నవ్వాను.

"ఆ తర్వాత ఇంత విషం మింగి చద్దామా?"

నా మనసు చివుక్కుమంది.

మాట్లాడకుండా తలవంచుకున్నాను.

"మాట్లాడరే?"

"ఏం చేద్దాం?"

"అదే ఆలోచిస్తున్నాను"

"చావడానికా?" అంది విసురుగా.

మరో దెబ్బ. కొట్టినచోటే కొడుతూంది! అదే ఆడదాని చేతిలో ఆయుధం.

"ఏదో చేస్తాను"

"ఎప్పుడు?"

"త్వరగానే"

"ఉదయం పాల డబ్బా తేవాలి. ఇంట్లో సరుకులు కూడా లేవు"

"చూస్తా"

"చూస్తానంటే కాదు తేవాలి"

నేను మౌనంగా ప్రక్కకి తిరిగి పడుకున్నాను.

నా మనసంతా అదోలా ఉంది.

పది నిమిషాలాగి భుజం మీద చెయ్యి వేసింది.

నేను కదలకుండా అలాగే ఉన్నాను.

"చూడండీ! మీరింకా చిన్నవాళ్ళు కాదు. బిడ్డకి తండ్రయ్యారు. ఏదోపనిచేసి సంపాదించాలి. మమ్మల్ని పెంచాలి" అంది.

"ఊ" అన్నాను.

"ఏం చేస్తారు?"

"చూస్తాను"

"చూస్తా కాదు. ఉద్యోగ ప్రయత్నం చేయాలి"

"అలాగే" అన్నాను కాని ఇంటర్ ప్యాస్‌గాని తనకు బంట్రోతు పనయినా దొరుకుతుందా? అదీ లేక ఎంతమంది రిక్షాలు తొక్కుతున్నారు. పోసీ రిక్షా తొక్కితే?

తనవల్ల అవుతుందా?

తను అలాంటి చిల్లర పనులు చేయగలడా?

తన పిచ్చిగాని ఏదన్నా ప్రయత్నం చేస్తే పని దొరక్కపోతుందా? ఏదన్నా కొట్లో గుమస్తాగా చేరితే ఏడెనిమిది వందలిస్తారు.

అవును ఆపని చేయాలి. ఏదన్నా కొట్టులో గుమస్తాగా....పక్కవాడి కొట్టుందిగదా. వాణ్ణడిగితే?.... ఎంతకాదన్నా అయినవాళ్ళం. కాదనడు.....తప్పక ఇస్తారు.

ఏడెనిమిది వందలంటే ఇద్దరి మనుషులకి దర్జాగా వెళ్ళిపోతుంది. ఈ పని ఎప్పుడో చేసుండవలసింది. చాలా తప్పు పని చేశాను. ఇన్నాళ్ళు ఆ ప్రయత్నం చేయకపోవడం తప్పయిపోయింది. సరే ఇప్పుడయితే ఏమయిందిలే. సమయానికి గుర్తుకొచ్చింది. అంతవరకూ సంతోషం అని ఆ ఆనందంతో తనవైపు తిరిగాను.

తనప్పుడే మాగన్నులో పడింది. ఒక్కసారి గాఢంగా కావులించుకొన్నాను.

ఉలిక్కిపడి లేచి నన్ను దూరంగా త్రోసేసింది.

"ఒక్కసారి చెప్తితే మనిషి కాదా? నన్ను ముట్టుకోవద్దు" అంది కోపంగా.

"ఏమిటి? ఊరుకున్న కొద్దీ మితిమీరి పోతున్నావు?" అన్నాను గద్దింపుగా.

ఒకసారి నా ముఖంలోకి చూసి, "మంచి మనిషికొకమాట మంచి గొడ్డుకోదెబ్బ" అంది.

నాకు తలతీసినట్టనిపించింది.

కోపంతో రెండు లాగుదామనుకున్నాను. కాని నిభాయించుకొని "అసలు నువ్వు నా పెళ్ళానివేనా?" అన్నాను.

"ఏమిటి మీ ఉద్దేశం? నువ్వు నా మొగుడివేనా? అని తిరిగి నేనూ అడగ్గలను. మొగుడిగా నన్నూ నా పిల్లల్నీ లోటు లేకుండా చూడండి. తర్వాత మీ కేమన్నా లోటుచేస్తే చెప్పుతో కొట్టండి" అంది.

"అంటే నన్నొక చేతగాని దద్దమ్మనంటావు?' అన్నాను రోషంగా.

"కాదని నిరూపించుకోవలసింది మీరే" అంది.

ఒక్కసారి తలతీసేసినంత అవమానమయింది "సరే! ఈ జన్మలో నీ ఒంటి మీద చెయ్యేస్తే

అద్భుగు" అన్నాను పౌరుషంగా.

తను ఒక్క క్షణం తొట్రుపాటు చెందింది. కాని మరుక్షణమే చాపతీసుకొని క్రిందేసుకుపడుకుంది.

ఆ రోజు నుంచీ ఈ ఆరేళ్ళుగా మాకు మాటలు లేవు. నేను మంచం మీద, తను చాప మీద గడిపేస్తున్నాం.

నేను అనుకొన్నట్టు తెల్లారి పక్కింటి వాణ్ణి పట్టు కొన్నాను. వాడు మొండి చెయ్యి చూపించాడు. ఉన్న ఇల్లమ్మి ఏదన్నా వ్యాపారం చేసుకోమని ఉచి తసలహా ఇచ్చాడు.

ఇల్లమ్మి నిలవ నీడలేకుండా చేసుకోవడం ఇష్టం లేదు నాకు. అదీ గాక ఉద్యోగం కూడా చూసు కోలేని బద్ధకస్తుణ్ణి వ్యాపారం చేయగలనా?

నెల్లాళ్ళు తిరిగి తిరిగి ఎలాగైతేనేం ఒక పని చూసుకోగలిగాను. సంపాదించుకున్నాను అనేకంటే దొరికింది అంటే భావ్యం.

ఒక రోజు నా పాతమిత్రుడు రోడ్డు మీద కలిసి, హోటల్‌కి లాక్కుపోయి నా యోగక్షే మాలు విచారించాడు. వాడు ఎం.ఎ. చదివాడు. కాని నిరుద్యోగ బాధపడలేక ప్లంబరుగా మారిపో యాడు. అభ్యంతరం లేకపోతే తనతో హెల్పరుగా రమ్మన్నాడు. అలా ఈ ఆరేళ్ళలో హెల్పర్ నుంచి ప్లంబరుగా మారాను.

నాకు మస్టరు ఏభై అరవై రూపాయిలుంటాయి గాని నెలకు పది పదిహేను రోజులు మించి పని వుండదు. ఒకో నెల ఒకటీ రెండు రోజులు కూడా వుండదు. ఆ విధంగానే ఆదాయం ఏ నెలా అయిదారు వందలు మించదు.

ఇంకా ఎక్కువ సంపాదించి నా భార్యని సుఖ పెట్టాలన్న కోరిక నాకులేదు. ఎందుకంటే నన్ను సుఖపెట్టాలనే కోరిక నా భార్యకు లేదుగనుక.

"మార్కెట్టుకి వెళుతున్నాం తలుపేసుకోమని చెప్ప బేబీ" అని కేకేసి మా ఆవిడ వెళ్ళిపోయింది.

తలుపు వేయడానికి బద్ధకం వేసి అలాగే పడు కొన్నాను. సాయంత్రం మూడు దాటుతోంది. ఆకాశంలో మబ్బులు తేలి ఆడుతున్నాయి.

ఎదురుగా పక్కింటివారి కూతురు మెడలో ధగ ధగా మెరిసిపోతూ నక్లెస్.

ఇలాంటి నెక్లస్ తనకు కావాలని మా పాప అడిగింది. ఇలాంటి నక్లెస్.. పోనీ ఈ నక్లెస్ అయితే? ... అంటే? తాను.. ఈ నక్లెస్.. ఛీ! తాను అలాంటి పని చేస్తాడా? తన కెంత గౌరవభంగం?

పాప దగ్గరగా వచ్చింది.

మెడలో నక్లెస్.

ధగ... ధగా...

పాప నన్ను చూసి నవ్వింది

"పాపా! ఎక్కడికి?" అడిగాను.

"గుడికండి" అంది.

# నగ్నకవిత



తలకాయతీసి పక్కన బెట్టి
అక్షరాల్ని పేనాలనే నా ప్రయత్నమంతా
ఎక్కడో తెగిపోయిన పక్షిరెక్క ఒకటి
ఎగిరొచ్చి నా గుమ్మం ముందు పడిన శబ్దం.

తలుపులన్నీ మూసేసి
అద్దం ముందు నగ్నంగా నిలబడి
నన్ను నేనే తనివితీరా చూసుకోవాలనుకుంటానా
దేహంలోని రోమాలన్నీ కత్తులై
నా కళ్ళల్లోకి దూసుకుపోతున్న
కల్లోల యాత్ర కంటబడుతుంది.
అవును మెదడు మేల్కొనకముందే
ఈ కవన క్షేత్రాన్ని చదును చేయాలి.

రాసిన అక్షరం రాసినట్టే
అదృశ్యమై పోతోంటే
వేసిన అడుగు వేసినట్టే
భూమిలోకి కూరుకుపోతున్న దృశ్యం.

పక్షి గొంతులోంచి పాట మాయమైన క్షణం
చెట్టు దేహం నుండి నీడ పారిపోయిన క్షణం
తుఫాను భీభత్సం తరవాత
ఆకాశంలో నక్షత్రాలన్నీ
అంతర్ధానమై పోయిన క్షణం
కళేబరాల్ని రాబందులు పీక్కు తినేసిన తరువాత
భూమి ఝల్లున త్రుళ్ళిపడ్డ క్షణం
నేనొక్కడినే సహస్ర జిహ్వాగ్రాలతో
నా శరీరాన్ని నేనే
చప్పరిస్తున్న దృశ్యం–

అవును
నా హృదయం ఒక ప్రశ్నార్థకంగా
నా ముందు నిలబడక ముందే
ఈ పద్యశవానికి ప్రాణం పోయాలన్నదే నా ఆరాటం.

ఎక్కడో ఒక తీగెనుండి
పుటుక్కున తెగిపడిన పువ్వు కెవ్వుమంది
ఆదమరచి నిద్రపోతున్న
నా భార్యా బిడ్డల్ని కావలించుకుని
కన్నీటి దుప్పటితో కప్పేశాను
అందరం తడిసి ముద్దయిపోయిన ఆ రాత్రి
మా ఇంటి తలుపు తట్టిన అతిథి
చచ్చిపోయి శతాబ్దాలు గడిచిందని
ఎవడికి తెలుసు?!

అవును నా సర్వేంద్రియాలూ
నిద్రాణంగా వున్నప్పుడే
ఈ మాటల ఎముకల పోగులకు
ఆకారాలిచ్చి
మీ అడవుల్లో వదిలేయాలన్నదే
నా ఆకాంక్ష.

–బి.ఆర్.వి.ప్రసాదమూర్తి

"ఏ గుడి?"

"కొండ మీదగుడి"

"అగు నేనూ వస్తా." పాపతోపాటు నడవసాగాను.

మెడలో నక్లెస్ పాప మెడలో నక్లెస్.

సూర్యకిరణాలు రాళ్ళపైబడి ధగధగా మెరుస్తూ నా కళ్ళు జిగేల్ మనిపిస్తున్నాయి.

ఈ నక్లెను కొట్టేస్తే?

ఈ నల్ల పాప మెడలో కంటే. అందమైన మా పాప బంగారు రంగులో ఈ నెక్లెసుకే అందం వస్తుంది.

కొట్టేయాలి.

ఎలా?

ఎవరన్నా చూస్తే?

ఎవరు చూస్తారు? ఈ ఊరిబయట కొండవార కెవరొస్తారు?

మెల్లగా పిల్ల భుజం మీద చెయ్యి వేసాను. ఒకసారి నా చెయ్యి చచ్చుబడిపోయినట్టు చల్లగా అయి పోయింది.

ఎంతో ప్రయత్నం మీద చెయ్యి వెయ్యడానికే ఇంత భయపడి పోతే, మెడలో నగ ఎలా తీసు కోగలను?

ఆ పని తనవల్ల కాదు. తన కసాధ్యం.

ఒక వేళ తీసుకొన్నా తీసుకున్న ఈ పిల్ల ఆ వివరాలు అందరితో చెప్పదా?

చెపుతుంది.

ఆ తర్వాత పోలీసులు. జైలు. అమ్మో! ఎంత అవమానం. తాను మళ్ళీ ఊర్లో తలెత్తుకు తిరగ్గలడా? లేదు..లేదు.. లేదు...

పోని పిల్లని చెప్పకుండా చేస్తే?

ఎలా చెప్పకుండా వుంటుంది?

నాలిక్కో సేస్తే.

నాలిక్కోయడానికి తనదగ్గర చాకు లేదే. అందుకే జేబులో ఒక చాకు పెట్టుకుంటారు దొంగలు.

మరెలా?

ఆ పాప నోరు మూయించడమెలా?

ఐడియా... అయ్యబాబోయ్! అంతపనే? ఆ పని తను చేయగలడా?

చేస్తే ఎవరు చూడొచ్చారు?

ఉత్తి నగ ఎత్తుకుపోతే ఆ పిల్ల అందరికీ చెబుతుంది. చంపేస్తే ఎవరు చంపిందీ తెలియదు. నగ ఎవరెత్తికెళ్ళిందీ తెలియదు.

"అవును.. అవును అంతే" ఆ పాప పీక పట్టుకొని గట్టిగా నొక్కేస్తాను.

ఆ పాప హృదయ విదారకంగా వేసినకేక కొండ లన్నీ ప్రతిధ్వనించి ఎవర్నా వస్తారేమోనని కంగారుగా మెడలో నక్లెను పీక్కొని పరుగుతీస్తున్నాను.

నా వెనుక మళ్ళీ హృదయ విదారకంగా ఆ



పాపకేక.

చంపేసానుగా మళ్ళీ ఎలా అరుస్తుందా అని వెనక్కు పరుగెత్తుకెళ్ళి చూసాను.

ఆ పాపా ఆ పాప కాదు. మా పాప.

నగ కోసం మా పాపని నేనే చంపేసావా?

'పాడు నగ' అని చేతిలో నక్లెస్ వంక చూసాను.

హఠాత్తుగా ఆ నగ త్రాచుపాముగా మారి నా చేతిమీద కాటు వేస్తూంది.

ఒక్కసారి భయంతో కేకపెట్టాను.

"ఏమిటి? ఏమయింది?" నన్ను కుదిపించి మా ఆవిడ.

ఉలిక్కిపడి కళ్ళుతెరిచాను. ఎదురుగా మా పాప. పాప మెడలో పక్కింటిపాప నక్లెస్.

ఆ నక్లెస్ పాములా మారిపోయి మా పాప మెడ పెనవేసుకుంటూంది.

"వద్దు... వద్దు.. అది పాము. తీసివేయి" అని అరిచాను.

"ఏమయింది? ఏమిటి పిచ్చిగా అరుస్తున్నారు"

"మన పాప మెడలో.. "నాకు మాటలు రావడం లేదు.

"నక్లెస్"

"అది ప్రక్క వాళ్ళ పాపది. అది పాము. మన కొద్దు తీసేయ్." అన్నాను. పిచ్చిగా.

"మీ కేదో దెయ్యం పట్టినట్టుంది. మన పాప మోజు పడుతుంది గదా అని అలాంటి నక్లేసే కొనుక్కొచ్చాను" అంది.

"డబ్బెక్కడిది?"

"మనదే"

"మన కెక్కడిది?"

"మీరిచ్చిందే."

"నేను ఏ రోజు కారోజు చాలీ చాలకుండా ఇస్తున్నాను"

"....."

"ఎక్కడివి"

"నేను రోజు కొక్కవూటే భోంచేసి ఆ డబ్బులు వెనకవేస్తున్నాను. పాప వుట్టి నప్పటి మంచి"

"ఆ"

"తప్పయితే క్షమించండి"

"ఏమిటీవాళ నీకు నువ్వే మాట్లాడుతున్నావా?"

"నేను ఎప్పుడూ మాట్లాడుకూడదమకోలేదు. మీకు మీరే మానేసారు"

"నేను సంతృప్తి కలిగేలా డబ్బు సంపాదించే వరకూ మాట్లాడకూడదనుకొన్నాను."

"మీరు సంపాదించాలని అలా ప్రవర్తించానుకాని ఇంత కావాలి అని నేనెప్పుడూ అనుకోలేదు. మీరు సంపాదించిన దానితోనే తృప్తి పడుతున్నాను."

"ఇటువంటి భార్యనా నేను కష్టాలపాలు చేయాలనుకొన్నది" నాకు కనువిప్పు కలిగింది. నేన సంపాదించాలి. నా భార్యా బిడ్డల్ని సుఖపెట్టాలి.






**జీవించడం జీవించడం**

రైల్లోనుంచి ఎంతమంది దిగిపోతున్నా
ప్రయాణం కొనసాగించడం
సుఖానికి దుఃఖానికి మధ్య దూరం
అంతంత మాత్రమేనా?
శ్మశాన మౌనాన్ని చీల్చుకొని
మంగళవాద్యాలు వినిపిస్తున్నాయేమిటి?
మరణశయ్యను, వివాహవేదికను
సమానంగా చూసేంత యోగులయ్యారేమిటి
మనుషులంతా?

జీవించడం జీవించడం
సుఖాన్ని అన్వేషించడం
దుఃఖం పొరల్ని బలవంతంగానైనా తొలగించి
పాతిపెట్టిన ఆనందాన్ని వెలికి తీయడం
వెచ్చటి కన్నీళ్ళతోనైనా ముఖం కడుక్కొని
కంటికి ఇంపుగా తయారవడం.
మరణానికి రాళ్ళైలాగూ కరగడం లేదు
పూలయినా రెండు కన్నీటి బొట్లు రాలుస్తాయా
ముళ్ళు గుచ్చుకుంటున్నాయని తెలుస్తోంది కాని
కాళ్ళకింద
గులాబీలు నలిగిపోతున్నాయని తెలియదు
జీవించడం ఎలాగూ తప్పదు
జీవించినంత కాలం
దుఃఖానందం అనుభవిద్దాం.

— ఆర్.వి.యస్. సుందరం